క్లుప్తంగా

పాద యాత్రికుల కోసం వైద్య శిబిరం


వైద్యశిబిరం వద్ద రెడ్‌క్రాస్ సభ్యులు

పాములపాడు: శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబా దేవి దర్శనార్థమై కాలి నడకన వెళ్తున్న యాత్రికుల కోసం శుక్రవారం రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాద యాత్రికులకు మందులతో పాటు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పాద యాత్రికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆర్ఎంపీలు సూచించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు మణిరాజు, గ్రామీణ వైద్యులు రాజు, లక్ష్మీనారాయణ, రాజేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా భువనేశ్వరి సభ

● రాకపోకలకు ఇబ్బందులు


ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన సభ

మహానంది: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు సతీమణి, నారా భువనేశ్వరి శుక్రవారం బుక్కాపురం గ్రామానికి వచ్చారు. గ్రామానికి చెందిన నల్లబోతుల చిన్న మద్దిలేటి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నారా భువనేశ్వ రి స్థానిక పంచాయతీ కార్యాలయం, పీర్లచావిడి ముందు సభను నిర్వహించారు. సభ కోసం పెండల్స్, షామియానాలు రోడ్డుపై వేయడంతో పాటు రోడ్డు బ్లాక్ అవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటుగా వెళ్లే వారు సుమారు రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోకి చేరిన హమాలీ వర్కర్స్ నాయకులు

వెలుగోడు: టీడీపీకి చెందిన హమాలీ వర్కర్ల కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంపీపీ లాలం రమేష్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ వంగాల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 25 కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ పథకాలు నచ్చి పార్టీలో చేరుతున్నామని, శిల్పా చక్రపాణిరెడ్డి విజయానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ తాలూకా ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామంలో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రైతు ప్రసాద్‌కు చెందిన గడ్డివామికి ప్రమాదవశాత్తూ మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా అప్పటికే పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు.

ఉచిత వైద్యశిబిరం


భక్తులకు వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద శ్రీశైలానికి కాలినడకన వెళ్లే కర్ణాటక భక్తులకు ఆరోగ్యశాఖ వైద్యశిబిరం ఏర్పాటు చేసింది. ఏఎన్ఎంలు సుజాత, బాల్లీశ్వరి, ఆశావర్కర్లు లక్ష్మీబాయి, తదిత భక్తులకు మందులు పంపిణీ చేశారు.

ఇఫ్తార్ విందులో భువనేశ్వరరెడ్డి



వెలుగోడు: స్థానిక లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలి మొక్కు వీరభద్రుడికే..!

కర్ణాటక, మహారాష్ట్ర నుంచి శ్రీశైలం వచ్చే భక్తులు మొదటి మొక్కు నాగలూటి వీరభద్రుడికే చెల్లిస్తారు. శ్రీశైల మల్లన్న సృష్టి లయకారుడైనప్పటికీ వారు తమ ఆరాధ్య దేవుడిగా వీరభద్రుడినే కొలుస్తారు. ఆ తర్వాతే శ్రీశైల మల్లన్నను దర్శించుకుంటారు.


నాగలూటి క్షేత్రంలో వెలసిన వీరభద్రస్వామి

● కన్నడ, మరాఠీలకు ఆరాధ్య దైవం నాగలూటి వీరభద్రస్వామి

ఆత్మకూరు: సృష్టికి లయకారుడు, భూ మండలంలో నాభి క్షేత్రంగా శ్రీశైల మహాక్షేత్రం వెల్లివిరుస్తోంది. ఈ క్షేత్రంలో వెలిసిన అమ్మవారు భ్రమరాంబాదేవిని కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు తమ ఆడ బిడ్డగా భావిస్తారు. ఏటా ఉగాది పర్వదినం సందర్భంగా లక్షలాది మంది కన్నడిగులు, మరాఠీలు తమ ఆడ బిడ్డను దర్శించుకునేందుకు శ్రీగిరికి తరలివస్తున్నారు. ముందుగా నల్లమల కొండ అంచుల్లోని నాగలూటి క్షేత్రంలో వెలసిన వీరభద్రస్వామికి తొలి మొక్కులు సమర్పిస్తారు. కోలాటాలు, విన్యాసాలతో ఆకట్టుకుంటారు. అనంతరం భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుంటారు. ప్రస్తుతం దాదాపు 10 రోజుల నుంచి కన్నడిగుల, మరాఠీలతో నాగలూటి క్షేతం కిక్కిరిసి కనిపిస్తోంది.

వందల కిలోమీటర్లు కాలినడకన..

వందల కిలో మీటర్ల దూరం నుంచి కాలినడకన శివ నామస్మరణ చేస్తూ శ్రీశైల క్షేత్రానికి చేరుకుంటారు. మధ్యలో తమ ఆరాధ్యదైవం నల్లమల కొండ అంచుల్లో వెలిసిన నాగలూటి వీరభద్రస్వామికి తొలి మొక్కు సమర్పిస్తారు. ప్రతి భక్తుడు నాగలూటి క్షేత్రం చేరుకోగానే దీపారాధన, దీపధూప నైవేద్యాలు సమర్పిస్తారు. వీరభద్రస్వామి ఆశీస్సులు పొంది మల్లన్న దర్శనభాగ్యంతో పాటు తమ ఆడ బిడ్డ దర్శనభాగ్యం కోసం శ్రీశైల క్షేత్రానికి నడక కొనసాగిస్తారు. ఉగాది పర్వదినం నాటికి శ్రీశైల క్షేత్రానికి చేరుకుంటారు.


నాగలూటి క్షేత్రం

శరభ.. శరభ.. భద్ర భద్ర..

కర్ణాటక, మహారాష్ట్ర భక్తులేగాకుండా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులు సైతం శరభ... శరభ... భద్ర భద్ర... అంటూ నాగలూటి వీరభద్రస్వామిని తలచుకుంటారు. తన భక్తులను సురక్షితంగా శ్రీశైల క్షేత్రానికి చేరేవరకు వీరభద్రస్వామి రక్షకుడిగా ఉంటాడని భక్తుల నమ్మకం. రవాణా సౌకర్యాలు లేని సమయంలో కూడా ప్రతిఒక్కరూ క్షేత్రానికి కాలినడకనే వెళ్లేవారు. అనంతరం రోడ్డుమార్గం ఏర్పడినప్పటికీ చాలామంది కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు కాలినడక ద్వారానే శ్రీగిరి చేరుకుంటున్నారు.

కాలినడకన నాగలూటికి చేరుకున్నా



మాది సోలాపూర్. ఆరేళ్లుగా శ్రీశైల క్షేత్రానికి కాలినడకన వస్తున్నా. దాదాపు 20 రోజులకు పైగా ప్రయాణం సాగుతుంది. మా ఇంటి ఇలవేల్పు నాగలూటి వీరభద్రేశ్వరస్వామి. అన్నివేళలా భక్తులను కాపాడే నాగలూటి క్షేత్రాన్ని సందర్శించిన తర్వాతే శ్రీశైల క్షేత్రానికి వెళ్తాం. వీరభద్రస్వామి ఆశీస్సులు మాకు ఎల్లవేళలా ఉంటాయి.

– దశరథవర్మ, సోలాపూర్, మహారాష్ట్ర

తొలిపూజ వీరభద్రుడికే



మాది కర్ణాటక రాష్ట్రంలోని షాపూర్. ఏటా ఉగాదికి శ్రీశైలానికి వస్తాం. శ్రీశైలానికి వెళ్లే ముందు కాలినడకన నాగలూటి వీరభద్రస్వామి వారిని సందర్శించి తొలి పూజలు చేస్తాం. వీరభద్రస్వామికి దీపారాధనలు, కాయ కర్పూరాలు సమర్పించి అన్నివేళలా అండగా ఉండాలని మొక్కులు చెల్లిస్తాం. ఆ తర్వాత శ్రీశైలానికి బయలుదేరుతాం. తెలుగు ప్రజలు దారి పొడవునా మజ్జిగ, అన్నదానం చేసి ఆదుకుంటున్నారు. ఇదంతా నాగలూటి వీరభద్రస్వామి ఆశీస్సులుగానే భావిస్తాం.

– లింగప్ప, షాపూర్, కర్ణాటక రాష్ట్రం


నాగలూటి క్షేత్రంలో అన్నదానంలో పాల్గొన్న కర్ణాటక భక్తులు

నేడు నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో ఫాల్గుణ కృష్ణ త్రయోదశి పురస్కరించుకుని శనివారం నందీశ్వరుడికి మహా ప్రదోష కాలంలో అభిషేకం నిర్వహించనున్నట్లు వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహానందీశ్వరుడి గర్భాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుడికి సాయంత్రం 4 గంటలకు అభిషేకం ఉంటుందన్నారు. పాల్గొనాల్సిన వారు 3.30 గంటలకు హాజరవ్వాలని కోరారు. నందీశ్వరుడికి ప్రదోష కాలంలో అభిషేకం చేయించుకోవడం ద్వారా సకల దోషాలు తొలగిపోతాయన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పెంపు

శ్రీశైలంప్రాజెక్ట్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్‌కు దరఖాస్తుకు ఈనెల 10వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు శ్రీశైలం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 9985061184 సంప్రదించాలన్నారు.

పోలీసుల కవాతు



మిడుతూరు: మండల పరిధిలోని చింతలపల్లి, ఖాజీపేట, వీపనగండ్ల గ్రామాల్లో రూరల్ సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్రబలగాలతో కలిసి శుక్రవారం కవాతు నిర్వహించారు. వీపనగండ్ల గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ సహకరించాలన్నారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

మేమంతా వైఎస్సార్‌సీపీ వెంటే


లాడెన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ద్వారకా నగర్ వాసులు


ఎమ్మెల్యే శిల్పాతో ఎస్సీ కాలనీవాసులు

● శుభకార్యానికి పిలిచి టీడీపీ కండువాలు వేశారు
● ఎస్సీ కాలనీ వాసులు

వెలుగోడు: శుభకార్యం పేరుతో పిలిచి తమకు టీడీపీ కండువాలు వేశారని, తామెప్పటికీ వైఎస్సార్‌సీపీ నేనని వెలుగోడు ఎస్సీ కాలనీ వాసులు అన్నారు. శుక్రవారం సర్పంచ్ వేల్పుల జయపాల్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని కలిశారు. అలాగే ద్వారకా నగర్‌కు చెందిన మరో 30 మంది లాడెన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులు మాట్లాడుతూ శుభకార్యం పేరుతో తమను వేల్పనూరుకు పిలిచి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కండువాలు వేయించారన్నారు. ఆయన వద్ద వద్దనలేక పోయామన్నారు. అంతే కానీ పార్టీని, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని వదలి వెళ్లే ఉద్దేశం లేదన్నారు. ఈ ఐదేళ్లలో తమకు ప్రభుత్వం లో ఎంతో మేలు చేసిందన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేతల ప్రలోభాలకు లొంగవద్దన్నారు. ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ రాఘవరెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్‌ఖాన్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన ఆదిదంపతులు



మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, బృందం ముందుగా అలంకార మండపంలో స్వామి, అమ్మవారి దంపతులకు విశేషపూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీసేవ నిర్వహించారు.

కూటమి కుయుక్తులను తిప్పికొట్టాలి


తాటిపాడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్

● వైఎస్సార్‌సీపీ నందికొట్కూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్

జూపాడుబంగ్లా: చంద్రబాబు కూటమి కుయుక్తులను ఓటుతో తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ నందికొట్కూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని తాటిపాడు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిపేదవాడికి సంక్షేమ ప్రభుత్వ పథకాలను అందాయన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారం టీడీపీ నాయకులు అడ్డమైన హామీలు ఇస్తూ మరోసారి మోసం చేయడానికి వస్తారని, వారిని నమ్మవద్దని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఎం నాగిరెడ్డి, మండడిసతీష్‌రెడ్డి, పోచా హేమశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, పీఎం మహేష్, కరుణాకర్‌రెడ్డి, దిలీప్, హరికృష్ణ, దినేష్, దొడ్డాసుధాకర్, అల్లావుద్దీన్, కృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, చిన్నమల్లయ్య, శేయనారెడ్డి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి


బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిద్ధార్థరెడ్డి, డాక్టర్ సుధీర్

నందికొట్కూరు: బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్‌తో కలిసి సిద్ధార్థ రెడ్డి పూలమాలలు వేసి నివాళుల్పరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కుల రహిత సమాజం కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలరు చెరుకు సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, చంద్రమౌళి, ఓంకార్‌రెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

● పట్టణంలోని వికలాంగుల కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి సంఘం జిల్లా అధ్యక్షులు మల్‌రెడ్డి నాగన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, పరమేష్ పాల్గొన్నారు.

● కొత్తపల్లి: బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జవహర్ బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● జూపాడుబంగ్లా: తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తన కార్యాలయంలో జగజ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట


అమ్మవారిని దర్శించుకుంటున్న సిద్ధార్థరెడ్డి

మిడుతూరు: మండల పరిధిలోని 49 బన్నూరు లో కర్రెమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజల్లో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, జేపీసీ మండల కన్వీనర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటి సారెతో మల్లన్న చెంతకు!

మరెక్కడా లేని విధంగా శ్రీశైల మహా క్షేత్రంలో ఉగాది మహోత్సవాలకు ఓ ప్రత్యేకత ఉంది. కన్నడ భక్తులు భ్రమరాంబాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా, మల్లికార్జున స్వామిని తమ అల్లుడిగా భావిస్తారు. పుట్టింటి నుంచి అమ్మవారికి సారె తీసుకు వచ్చి సమర్పిస్తారు. శతాబ్దాల కాలం నుంచి ఈ ఆచారం కొనసాగుతోంది. తమ సొంత గ్రామాల నుంచి మల్లన్న చెంతకు మండుటెండలో పాద యాత్ర చేసుకుంటూ శ్రీగిరి చేరుకుంటారు. వయసుతో నిమిత్తం లేకుండా వృద్ధ మహిళలు సైతం నల్లమల అటవీప్రాంతంలో శివనామస్మరణ చేసుకుంటూ కాలినడకన శ్రీగిరి చేరుకుంటారు.

● శతాబ్దాల నుంచి కన్నడ భక్తుల ఆచారం
● మండుటెండలో వందల కిలోమీటర్ల పాదయాత్ర




నల్లమల అటవీప్రాంతంలో రథాన్ని లాక్కుంటూ వస్తున్న కన్నడ భక్తులు, పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న కన్నడ భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలక్షేత్రంలో జరిగే ఉగాది మహోత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. మండుటెండలను లెక్కచేయక కన్నడ భక్తులు కాలినడకన శ్రీగిరి చేరుకుంటున్నారు. స్వామి అమ్మవార్లకు నిర్వహించే విశేష వాహనసేవలను కనులారా తిలకించి, కర్పూర నీరాజనాలు సమర్పించి భక్తితో పరవశించి పోతారు. ఉత్సవాల అనంతరం తిరుగు పయనమవుతారు.

పుట్టింటి సారెతో

శ్రీశైల భ్రమరాంబాదేవిని తమ ఇంటి ఆడపడుచుగా, మల్లికార్జున స్వామిని తమ సొంత అల్లుడిగా కన్నడ భక్తులు భావిస్తారు. ఉగాది మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి పుట్టింటి సారె (పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు) తీసుకుని కాలినడక బయలుదేరుతారు. ఇది శతాబ్దాల ఆచారం. ఎండలు మండుతున్నా వృద్ధులు, మహిళలు సైతం నల్లమల అడవుల్లో పాదయాత్రగా శివనామ స్మరణతో శ్రీగిరి చేరుకుంటారు. శ్రీశైల క్షేత్రానికి బయలుదేరే ముందు కన్నడిగులు తమ ఇంట్లో అఖండజ్యోతిని వెలిగిస్తారు.

నీలకంఠుడి చెంత కన్నడిగులు

శ్రీశైలంలో వెలసిన నీలకంఠుడి క్షేత్రం కన్నడిగుల మయమైంది. ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన పలు ప్రదేశాల నుంచి కన్నడ భక్తులు తండోపతండాలుగా శ్రీగిరికి చేరుకున్నారు. క్షేత్రంలో బస చేస్తూ శనివారం నుంచి ప్రారంభం కానున్న స్వామిఅమ్మవార్ల ఉత్సవాలను తిలకించేందుకు ఇప్పటికే శ్రీగిరి చేరుకున్నారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన కన్నడ భక్తులు కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు, హారతలిచ్చారు. అనంతరం మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలైన్ల వద్దకు చేరుకుని బారులు తీరారు. నేటితో మల్లన్న స్పర్శదర్శనం ముగిసింది. శనివారం నుంచి ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నారు. మల్లన్న స్పర్శ దర్శనానికి చివరి రోజు కావడంతో కన్నడిగులు అధికసంఖ్యలో చేరుకుని మల్లన్నను దర్శించుకున్నారు.

కన్నడ భక్తులకు విస్తృత ఏర్పాట్లు

ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. వేకువజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రాత:కాల పూజల అనంతరం 4.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి 5.30 నుంచి రాత్రి 2 గంటల వరకు దర్శనాలు కొనసాగనున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఉండేందుకుగాను దేవస్థానం యూనిట్ అధికారులకు, పర్యవేక్షకులుకు, ఇతర సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించారు. క్యూకాంప్లెక్స్‌లో వేచివున్న భక్తులకు నిరంతరం అల్పాహారం, బిస్కెట్లు, తాగు నీరు, మజ్జిగ అందజేస్తున్నారు. 10 కౌంటర్ల ద్వారా లడ్డూ ప్రసాదాలను అందజేస్తున్నారు. భక్తులు సేద తీరేందుకు క్షేత్ర పరిధిలో పలుచోట్ల, ఉద్యానవనాలలో షామియానాలు, చలువ పందిళ్లు ఏర్పాట్లు చేశారు. 10 చోట్ల వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు.


టెంకాయ వదులుతూ..


క్షేత్ర పురవీధుల్లో కన్నడ భక్తుల సందడి



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శిల్పా



ఆత్మకూరు: పట్టణంలో శుక్రవారం ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందులో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు రషీద్, నూర్‌మహ్మద్, అహ్మద్‌హుసేన్, తబిరేష్, సుల్తాన్, వరాల మాలిక్, ఫయాజ్ పాల్గొన్నారు.